సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 1 । జూలై । 2023



ముగిసిన ఏకాహం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం ప్రారంభమైన శ్రీరామనామ ఏకాహం శుక్రవారం ఉదయం ముగిసింది.



సెట్‌వెల్ శిక్షణ

దెందులూరు: కొవ్వలి హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ ఇచ్చారు.

నిత్యాన్నదానానికి విరాళం



కాళ్ల: సీసలిలో షిరిడీ సాయిబాబా ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి చామర్తి బాలసత్య వెంకట పద్మావతి జ్ఞాపకార్థం ఆమె కుమార్తె శ్రీదేవి (ఉండి మండలం యండగండి) రూ.1,01,116 విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

వైద్యుల సేవలు వెలకట్టలేం



కలెక్టర్‌కు జ్ఞాపిక అందిస్తున్న డాక్టర్లు

భీమవరం(ప్రకాశం చౌక్): వైద్యులు కరోనా సమయంలో చేసిన సేవలను వెలకట్టలేమని, వైద్యులు ప్రత్యక్ష దైవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం కాళ్ల మండలం పెదమిరం రాధా కృష్ణ కన్వెన్షన్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే ఫ్యామిలీ మీట్ సమావేశం నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. మరణానికి చేరువైన వారిని తిరిగి పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసే వైద్యులకు సమాజంలో ఎంతో గౌరవం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికీ ఇంటి వద్దే వైద్య సేవలందిస్తోందన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరపున 50 ఏళ్లుగా వైద్య సేవలు అందించిన 25 మంది వైద్యులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. అనంతరం వైద్యులు కలెక్టర్‌కు జ్ఞాపిక అందించిన సన్మానించారు. డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, ఐఎంఏ అధ్యక్షుడు జి.బాలకృష్ణ, కార్యదర్శి ఎస్.శంకర్‌కుమార్ వర్మ, కల్చర్ కమిటీ చైర్మన్ ముదునూరి గోపాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ఓపెన్' పరీక్షలు

సాక్షి, భీమవరం: జిల్లాలో శుక్రవారం ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. పదో తరగతిలో 567 మంది విద్యార్థులకు 440 మంది, ఇంటర్‌లో 527 మందికి 468 మంది హాజరయ్యారన్నారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎనిమిది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదన్నారు.

2న లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ సంఘ సమావేశం

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ) వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు సంఘ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సమన్వయకర్త పెనుమాక రామ్మోహనరావు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు గుంటూరు జిల్లా నరసరావుపేటలోని వీవీఆర్ గ్రాండ్ హోటల్‌లో సమావేశం నిర్వహిస్తామని, మాస్టర్ డేటా, అనగ్జర్-3, కంజెస్టెడ్ ఏరియాల్లో భవనాల నిర్మాణంలో యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు.

ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల సరెండర్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపాలిటీలో పనిచేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ బి.జ్యోతిలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.కృష్ణమోహన్‌ను సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) విజయవాడకు సరెండర్ చేస్తూ కలెక్టర్ ప్రశాంతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ పనితీరు బాగా లేకపోవడం, ఆరోపణల నేపథ్యంలో ఆమెను సరెండర్ చేశారు. అలాగే ఇటీవల మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణపై ఏసీబీ దాడుల నేపథ్యంలో కృష్ణమోహన్ ఇంటిపై కూడా సోదాలు, ఆరోపణల నేపథ్యంలో అతడిని కూడా సరెండర్ చేశారు.

జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు పిలుపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత ప్రభుత్వం, ఎంహెచ్ఆర్‌డీ పాఠశాల విద్య ఆధ్వర్యంలో 2023కి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేయనున్నారని ఏలూరు డీఈఓ ఎన్‌వీ రవిసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు అవార్డు కోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా సెలెక్షన్ కమిటీ వాటిని పరిశీలించి రాష్ట్ర సెలెక్షన్ కమిటీకి ఈనెల 25లోపు పంపాలని తెలిపారు. రాష్ట్ర కమిటీ ఎంపిక చేసిన దరఖాస్తులను ఇండిపెండెంట్ నేషనల్ జ్యూరీ ఈనెల 26 నుంచి వచ్చేనెల 3 వరకు ఆన్‌లైన్‌లో పరిశీలిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఎంహెచ్ఆర్‌డీ అధికారులు షార్ట్‌లిస్ట్ చేసిన ఉపాధ్యాయుల వివరాలను వచ్చేనెల 4, 5 తేదీల్లో పొందుపరుస్తారని తెలిపారు. అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయుల జాబితాను వచ్చేనెల 14న వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారని డీఈఓ రవిసాగర్ పేర్కొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ ప్రవేశాలకు నోటిఫికేషన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023-24లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఏలూరు సీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రామరాజు, వర్సిటీ రీజినల్ కో-ఆర్డినేటర్ వీఏఎన్ సతీష్ తెలిపారు.

ఫిష్ ఆంధ్రతో ఉపాధి బాటలు

లాభాలు 'చేప'ట్టేలా..
- ఏలూరు జిల్లాలో 331 యూనిట్లకు అవకాశం
- ఉపాధి మార్గాలుగా మినీ యూనిట్లు
- ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీ
- ఇప్పటికే 272 యూనిట్ల గుర్తింపు



కైకలూరులో ఫిష్ ఆంధ్ర పథకంలో వచ్చిన రిఫ్రిజిరేటర్లను అందిస్తున్న ఏడీ చాన్ బాషా



కైకలూరులో ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్

కైకలూరు: ఆక్వాకల్చర్ సుస్థిర అభివృద్ధికి ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా ఆర్థిక దన్ను అందిస్తోంది. ఔత్సాహిక రైతులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా అమలు చేస్తున్నాయి. చేపలు, రొయ్యల వినియోగాన్ని క్షేత్రస్థాయిలో పెంచడానికి మినీ యూనిట్లకు అవకాశం కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు సబ్సిడీని అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. మత్స్య సంపద ఉత్పత్తుల్లో దేశంలోనే తొలి స్థానంలో నిలుస్తున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఫిష్ ఆంధ్ర యూనిట్లు మరింత ఆర్థిక శక్తిని పెంపొందిస్తున్నాయి.

2.50 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 2,50,045 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. ఏటా దాదాపు 17,15,362 టన్నుల ఆక్వా ఉత్పత్తులు వస్తున్నాయి. ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్‌కు రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు, రోజువారి మినీ యూనిట్లకు రూ.10 లక్షలు, సూపర్ యూనిట్లకు రూ.20 లక్షలు, లాంజ్ యూనిట్లకు రూ.50 లక్షలతో పాటు త్రీ వీలర్స్, ఫోర్ వీలర్స్ కూడా సబ్సిడీపై అందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఎంచుకున్న యూనిట్లకు కేంద్రం 36 శాతం, రాష్ట్రం 24 శాతం కలిపి 60 శాతం సబ్సిడీ అందిస్తున్నారు. ఇతరులకు కేంద్రం 24 శాతం, రాష్ట్రం 16 శాతం కలిపి 40 శాతం రాయితీ ఇస్తున్నారు. అలాగే ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద రూ.10 లక్షల అర్హత కలిగిన ప్రాజెక్ట్ వ్యయంలో రూ.35 శాతం రాయితీ ఇస్తున్నారు.

157 మందికి బ్యాంకు రుణాలు : ఫిష్ ఆంధ్ర పథకం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలకు బాటలు చూపుతోంది. ఏలూరు జిల్లాలో ఈ పథకంలో 331 యూనిట్లు మంజూరు కాగా ఫిషరీస్, మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటివరకు 272 యూనిట్లను గుర్తించారు. వీటిలో 190 యూనిట్లకు సంబంధించి పూర్తి వివరాలను బ్యాంకులకు అందించారు. మొత్తం 157 మందికి బ్యాంకులు రుణాన్ని మంజూరు చేశాయి. ఇప్పటికే జిల్లాలో 43 ఫిష్ ఆంధ్ర దుకాణాలు పనిచేస్తున్నాయి. చింతలపూడి, ముదినేపల్లి, కొయ్యలగూడెంలో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన యూనిట్లు కొనసాగుతున్నాయి.

కలిదిండిలో ఆక్వాహబ్

రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తుల్లో అగ్రగామిగా కలిదిండి మండలం నిలుస్తోంది. జీడీపీ వృద్ధిలోనూ కీలకంగా ఆక్వా రంగం నిలుస్తోంది. ఏలూరు జిల్లాలో కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలంలో రూ.కోటి నిధులతో ఆక్వా హబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే స్థల సేకరణ పూర్తికాగా నిర్మాణాలు సాగుతున్నాయి. ఇక్కడ హబ్‌కు సజీవ చేపలు, రొయ్యలు చేరతాయి. ఇక్కడ నుంచి వాహనాల ద్వారా వివిధ ఫిష్ ఆంధ్ర యూనిట్లకు సరఫరా చేస్తారు. సముద్ర ఉత్పత్తులను సైతం హబ్‌లో విక్రయించుకునే అవకాశం ఉంటుంది. దీంతో దళారీ వ్యవస్థకు చెక్ పడనుంది. ఆక్వా సేవలు మొత్తం హబ్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఆక్వా రంగానికి అన్నివిధాలా సాయమందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆక్వా రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రంగానికి అన్నివిధాలా సాయమందిస్తున్నారు. కరోనా సమయంలోనూ ఆక్వా ఉత్పత్తుల రవాణాకు అవకాశం కల్పించారు. విద్యుత్ సబ్సిడీని అందిస్తున్నారు. కలిదిండిలో ఆక్వాహబ్ అందుబాటులోకి రానుంది. పోషకాహార విలువలు కలిగిన చేపలు, రొయ్యల వాడకాన్ని మరింత పెంచడానికి ఫిష్ ఆంధ్ర పథకం దోహదపడుతుంది.

–షేక్ చాన్ బాషా, మత్స్యశాఖ సహాయ సంచాలకులు, కైకలూరు

ఆక్వా నీరు వదిలితే ఊరుకోం



కె.లంక పంట కాలువను పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ ప్రియదర్శిని

సాక్షి ఎఫెక్ట్

కాళ్ల: పంట కాలువలోకి ఆక్వా చెరువుల నీరు వదిలితే కఠిన చర్యలు తప్పవని ఎఫ్‌డీఓ ఎంఐ ప్రియదర్శిని హెచ్చరించారు. ఈనెల 28న 'సాక్షి'లో ప్రచురించిన 'రొయ్యల చెరువుల నీరు పంట కాలువలోకి' కథనానికి అధికారులు స్పందించారు. దీంతో మత్స్యశాఖ అధికారులు శుక్రవారం మండలంలో కె.లంక చానల్ పంట కాలువను పరిశీలించారు. పంట కాలువ వెంబడి పర్యటించి ఆక్వా చెరువుల నీటిని పంట కాలువల్లోకి వదలకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మంచినీటి చెరువులు నింపుకోవాల్సిన సమయంలో రొయ్యల చెరువులో నీరు పంట కాలువలోకి వదలడం సమంజసం కాదని ఎఫ్‌డీఓ అన్నారు. ఆక్వా చెరువుల నీరు మురుగు కాలువల్లోకి వదలరాదని, నిబంధనలు మీరి పంట కాలువల్లోకి వదిలితే ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. ఆక్వా చెరువుల యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎఫ్‌డీఓ ప్రియదర్శిని సూచించారు.

నేటి నుంచి 'జగనన్న సురక్ష' శిబిరాలు

- తొలిరోజు 53 సచివాలయాల్లో నిర్వహణ
- ఇప్పటివరకు 1.10 లక్షల కుటుంబాల సర్వే
- 24 వేల సర్టిఫికెట్ల జారీ



జగనన్న సురక్ష సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందుకోలేని వారు ఎవరూ ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని నిర్దేశించారు. నెల రోజులపాటు నిర్వహించే సురక్ష కార్యక్రమంలో ముందుగా ఇంటింటా సర్వే చేపట్టారు. జిల్లావ్యాప్తంగా పది రోజులుగా సురక్ష సర్వే సాగుతోంది. వలంటీర్లు, సచివాలయం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. జిల్లాలో 6.41 లక్షల కుటుంబాలు ఉండగా ఇప్పటివరకూ 1.10 లక్షల కుటుంబాల సర్వే పూర్తయ్యింది. 535 సచివాలయలకు ప్రస్తుతం 159 సచివాలయాల్లో సర్వే సాగుతోంది. సర్వే పూర్తయిన గ్రామాల్లో శనివారం నుంచి ఆయా సచివాలయాలు వద్ద శిబిరాలు నిర్వహిస్తారు. శనివారం తొలిరోజు 53 సచివాలయాల వద్ద క్యాంపులు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఈనెల 4న 54 సచివాలయాలు, 6న 52 సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించనున్నారు. అలాగే జిల్లాలో ఇప్పటివరకు పలు రకాల సర్టిఫికెట్లకు సంబంధించి 27 వేల దరఖాస్తులు రాగా 24 వేల సర్టిఫికెట్లను జారీ చేశారు. ఆయా గ్రామ సభల్లో సర్టిఫికెట్లు అందించనున్నారు.

'జగనన్న సురక్ష' విప్లవాత్మకం



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష విప్లవాత్మక కార్యక్రమమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం తూర్పుపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలుచేస్తూ.. ఇంకా ఎవరైన లబ్ధిదారులు ఉన్నారేమో అని గుర్తించి వారికి కూడా పథకాలు అందించేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇది ప్రతిపక్షాలకు కంటగింపుగా ఉండటంతో దుష్ప్రచారానికి తెరలేపుతున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు, తిరిగి వాటిపై పర్యవేక్షణ చేస్తుంటే ప్రతిపక్షాలు హడలిపోతున్నాయని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న గ్లోబెల్స్ ప్రచారాన్ని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలను సచివాలయాల్లో ఉచితంగా అందిస్తారన్నారు. ఆచంట నియోజకవర్గంలోని 64 సచివాలయాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తిచేశామని, ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నామన్నారు. ఇప్పుడు మరోమారు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళుతున్నారన్నారు. పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, మార్టేరు ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు, ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, విద్య, వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ పలివెల శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.1.62 కోట్ల పంటల బీమా మంజూరు

సాక్షి, భీమవరం: గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులకు రూ.1.62 కోట్ల పరిహారం మంజూరైందని జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా పరిహారాన్ని ఈనెల 8న పంట నష్టపోయిన రైతుల ఖాతాల్లో జమచేస్తారన్నారు. రైతుల జాబితా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించి ఈనెల 3వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారని చెప్పారు. పంటల బీమాకు జిల్లాలోని 10 మండలాల పరిధిలోని 16 గ్రామాలు అర్హత పొందాయని, గ్రామం యూనిట్‌గా తీసుకుని పంట దిగుబడి ఆధారంగా బీమా వర్తిస్తుందన్నారు. అయితే ఖరీఫ్ పంట కాలంలో ఈ-క్రాప్‌లో నమోదైన రైతులు మాత్రమే బీమాకు అర్హత సాధిస్తారన్నారు.

పంటల బీమా వర్తించే గ్రామాలు

ఆకివీడు మండలంలో ధర్మాపుర అగ్రహారం, దుంపగడప, కాళ్ల మండలంలో బొండాడ, కోనాలపల్లె, భీమవరం మండలంలో లోసరిగుట్లపాడు, నరసాపురం మండలంలో చినమామిడిపల్లి, పాలకోడేరు మండలంలో పెన్నాడ అగ్రహారం, పోడూరు మండలంలో మినిమించిలిపాడు, తాడేపల్లిగూడెం మండలంలో కృష్ణయ్యపాలెం, తణుకు మండలంలో కొమరవరం, కోనాల, తణుకు వేమవరం, ఉండి మండలంలో ఉప్పులూరు, యలమంచిలి మండలంలో చించినాడ, ఏనుగువానిలంక గ్రామాలున్నాయని వ్యవసాయాధికారి తెలిపారు.

అంబులెన్స్‌లో రోగులున్నారా?

పవన్ కల్యాణ్ సందేహం

సాక్షి, భీమవరం: జనసేన వారాహి విజయాత్ర సందర్భంగా భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభ సమయంలో అంబులెన్స్ వెళుతుంటే ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సందేహం వ్యక్తం చేయడం విస్మయానికి గురిచేసింది. సాయంత్రం 7.20 గంటలకు పవన్ సభాస్థలికి చేరుకున్నారు. ప్రసంగం ప్రారంభించిన కొద్దిసేపటికి అంబులెన్స్ సభావేదిక దగ్గరగా వెళ్లడంతో తన ప్రసంగాన్ని ఆపి కార్యకర్తలను అంబులెన్స్‌కు దారి ఇవ్వాలంటూ పవన్ కల్యాణ్ కోరారు. మరి కొద్ది సేపటికి మరో అంబులెన్స్ రావడంతో అనుమానంతో అంబులెన్స్‌లో నిజంగా పేషెంట్లు ఉన్నారా? అంటూ పవన్ సందేహం వ్యక్తం చేయడంతో సభ ప్రాంతంలోని ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. పవన్ ప్రసంగం చప్పగా సాగడంతో ఆకట్టుకోలేకపోగా అంబులెన్స్ గురించి ఆరా తీయడం విడ్డూరంగా ఉందంటూ గుసగుసలు వినిపించాయి.

మాట తీరుమార్చుకుని..

సభలో పవన్ కల్యాణ్ మాట్లాడిన తీరు ఆశ్చర్యం కలిగించింది. పవన్ కల్యాణం పూనకం వచ్చినట్టుగా ఊగిపోతూ మాట్లాడటం తప్ప ప్రజాసమస్యలపై అవగాహన లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో పవన్ కల్యాణ్ మాట్లాడే తీరును మార్చుకున్నట్టు కనిపించింది. ఆయన నిలకడగా మాట్లాడటం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ప్రశాంతంగా 'ఓపెన్' పరీక్షలు

సాక్షి, భీమవరం: జిల్లాలో శుక్రవారం ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. పదో తరగతిలో 567 మంది విద్యార్థులకు 440 మంది, ఇంటర్‌లో 527 మందికి 468 మంది హాజరయ్యారన్నారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎనిమిది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదన్నారు.

విశ్వ బ్రాహ్మణుల ఆనందోత్సాహాలు



- వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయాలకు ధూప, దీప, నైవేద్యం పథకం వర్తింపు
- నెలకు రూ.5 వేల చొప్పున ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న విశ్వ బ్రాహ్మణులు

ఏలూరు (టూటౌన్): విశ్వ బ్రాహ్మణుల ఆరాధ్య దైవం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాలకు ధూప, దీప, నైవేద్యాల నిమిత్తం నెలకు రూ.5 వేలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంపై విశ్వ బ్రాహ్మణుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. ధూప, దీప, నైవేద్యం పథకం కింద నిధులు అందించేలా దేవదాయ శాఖ కమిషనర్ గత నెల 23న జీఓ జారీ చేశారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, డైరెక్టర్ల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి బ్రహ్మంగారి ఆలయాల్లో పథకాన్ని అమలు చేయాలని కోరగా.. వెంటనే సీఎం జగన్ స్పందించి చర్యలు తీసుకున్నారని విశ్వబ్రాహ్మణులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

చాలా గొప్ప విషయం



ప్రపంచానికి భవిష్యత్తు కాలజ్ఞానాన్ని తెలియజేసిన మహనీయులు వీర బ్రహ్మేంద్రస్వామి. ఆయన విశ్వ బ్రాహ్మణులకు ఆరాధ్యుడు. అటువంటి మహనీయుని ఆలయాలకు ప్రభుత్వం ధూప, దీప, నైవేద్యాల నిమిత్తం నెలకు రూ.5 వేలు ఇవ్వనుండటం చాలా గొప్ప విషయం. సీఎం జగన్‌కు విశ్వ బ్రాహ్మణుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– లక్కోజు రాజగోపాలాచారి, డైరెక్టర్, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్, ఏలూరు

తగిన గుర్తింపు



జగనన్న ప్రభుత్వంలోనే రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణులకు తగిన గుర్తింపు లభించింది. గత పాలకులు విశ్వ బ్రాహ్మణులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకున్నారు. ఇందుకు భిన్నంగా అన్ని రంగాల్లోనూ సీఎం జగన్ విశ్వ బ్రాహ్మణులకు ప్రాధాన్యమిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు చెబుతున్నాం.

– ఈదలాడ నాని, యువజన సంఘం నాయకుడు, ఏలూరు విశ్వబ్రాహ్మణ సంఘం

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



బ్రహ్మంగారి ఆలయాలకు ధూప, దీప, నైవేద్యాల కింద నెలకు రూ.5 వేలు అందించాలని నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు. ఆ రోజుల్లోనే అన్ని కులాలకు ప్రాధాన్యమిచ్చి తన శిష్యులుగా చేసుకున్న మహోన్నతుడు వీరబ్రహ్మేంద్రస్వామి. అటువంటి మహనీయునికి గుర్తింపు ఇవ్వడం చాలా సంతోషం.

– పట్నాల శేషగిరిరావు, విశ్వబ్రాహ్మణ సంఘం నేత, ఆకివీడు

బీసీ పక్షపాతి సీఎం జగన్



రాష్ట్రంలోని బీసీల పక్షపాతిగా సీఎం జగన్ మరోసారి నిరూపించుకున్నారు. ఇప్పటికే అన్ని రంగాల్లో బీసీలకు పెద్దపీట వేస్తూ వచ్చిన ఆయన తాజాగా విశ్వ బ్రాహ్మణుల కోరికను మన్నించి సానుకూల నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. విశ్వ బ్రాహ్మణులంతా సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– ప్రసాద్, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్రనాయకులు, జాలిపూడి

గత పాలకులకు భిన్నంగా..



గత పాలకులకు భిన్నంగా నేడు రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణులకు గుర్తింపు లభించింది. ప్రభుత్వ నిర్ణయం ద్వారా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల నిర్వహణకు మేలు జరుగుతుంది. విశ్వ బ్రాహ్మణ మహిళల తరపున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– సురవరపు కనకదుర్గ, సర్పంచ్, ఎన్నార్పీ అగ్రహారం, ఉండి

క్లుప్తంగా

ఉపాధ్యాయులు, ప్రభుత్వానికి వారధిలా వైఎస్సార్‌టీఎఫ్



ఎంపీ విజయసాయిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ వారధిలా పని చేస్తుందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్పష్టం చేశారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శుక్రవారం విజయవాడలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుడు విజయ సాయిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. విజయసాయిరెడ్డి ఆశీస్సులతో వైఎస్‌ఆర్‌టీఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవులు పొందామని వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గించేందుకు రెండో ఎంఈఓ పోస్టు ఏర్పాటు చేశారని, గత ప్రభుత్వాలు నిర్వహించిన డీఎస్సీకి సంబంధించి అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా తప్పుకుంటే.. ఆ బాధ్యతను ముఖ్యమంత్రి జగన్ పూర్తి చేశారన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ముదినేపల్లి రూరల్: చేపల చెరువులో పని చేస్తూ ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని వైవాకలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన మెరుగు ఆదాం (55) చేపలచెరువుపై కాపాలదారుడిగా ఉంటున్నాడు. చెరువులో మేత వేసేందుకు పడవపై వెళ్లగా ప్రమాదవశాత్తూ ఆదాం లుంగీ ఏరియేటర్‌కు తగలడంతో చెరువులో పడి మునిగి మృతి చెందాడు. ఆదాంకు భార్య ముగ్గురు కుమార్తెలున్నారు. భార్య విమల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

వైద్యులు.. ప్రాణ దాతలు



- కరోనా విపత్తులో ప్రాణాలకు తెగించి సేవలు
- ఫ్యామిలీ డాక్టర్‌లో ఇంటింటికీ వైద్య సేవలు
- నేడు ప్రపంచ వైద్యుల దినోత్సవం

భీమవరం(ప్రకాశం చౌక్): రాత్రీ పగలు తేడా లేకుండా వైద్య సేవలు అందించి ప్రాణాలను రక్షించేది వైద్యులు. దేవుడిలా మన ప్రాణాల్ని నిలబెట్టే వైద్యుడికి మనం చేతులెత్తి మొక్కుతాం. ఆ వైద్యుల సేవల్ని స్మరించుకుంటూ ఏటా జూలై 1న డాక్టర్స్ డేగా జరుపుకుంటున్నాం. వైద్య విద్య మిగతా వాటితో పోల్చుకుంటే కష్టమైంది. ఎంతో కష్టపడి వైద్య వృత్తిలోకి ప్రవేశించే వైద్యులకు నిత్యం ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. రోగులను చిరునవ్వుతో పలకరించి వారికి వైద్యం చేయడమే కాకుండా ధైర్యం చెప్పి ప్రాణాలు నిలబెడతారు.

కరోనా సమయంలో..

కరోనా విపత్తులో వైద్యులు చూపిన తెగువ మనం కళ్లారా చూశాం. ప్రాణాలకు తెగించి ఎందరో ప్రాణాలు నిలబెట్టిన ప్రాణదాతలు వైద్యులు. ప్రమాదకరమైన పరిస్థితి ఉన్నా వెనకడుగు వేయకుండా వైద్య సేవలు అందించారు. ఒక విధంగా కరోనాపై యుద్ధంలో కీలకపాత్ర పోషించారు. వేలాది మంది ప్రాణాలను రక్షించారు. మన శరీరానికి వచ్చిన వ్యాధులనే కాకుండా మనో వ్యాకులతకు, ఆందోళనలకు చికిత్స అందించి ఎందరో ప్రాణాలను కాపాడుతున్నారు వైద్యులు.

వైద్య విద్య చదివేందుకు యువత మొగ్గు

గతంలో డాక్టరు కోర్సు చదవాలంటే సామాన్యులకు అయ్యేపని కాదు. అయితే ఇప్పుడు వైద్య కళాశాలలు పెరగడం, వైద్య రంగంలో అధునాతక విధానాలు అందుబాటులోకి రావడంతో అనేకమంది యువత వైద్య విద్య చదివేందుకు ముందుకు వస్తున్నారు. గతంలో ఎంబీబీఎస్‌లకే పరిమితమైన యువత ఇప్పుడు పీజీలు కూడా చేస్తున్నారు. దీంతో మనకు దాదాపు అన్ని చోట్ల స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులోకి వచ్చారు. రాష్ట్రంలో మరింత మంది వైద్యుల్ని తయారు చేసే లక్ష్యంతో ఇప్పటికే ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో వైద్య కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ విద్యా సంవత్సరం నుంచే రాష్ట్రంలో కొత్తగా 5 ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి వస్తున్నాయి.

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు	: 150
వైద్యులు	: 300 మంది
జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి	: 1
ఏరియా ఆస్పత్రులు	: 4
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	: 52
ఫ్యామిలి ఫిజీషియన్‌లో పనిచేసే వైద్యులు	: 64 మంది
ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు	: 70



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

ఫ్యామిలీ ఫిజీషియన్ పథకంలో ఇంటింటికి వైద్య సేవలు

వైద్య కోర్సు పూర్తి చేసి ప్రజలకు సేవ చేయాలనే తపనతో ఉన్న డాక్టర్లుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ చక్కని అవకాశాలు కల్పించింది. వైద్యులుగా ఈ విభాగంలోకి అనేక మంది కొత్త వైద్యులు వచ్చారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. రోగుల ఇంటివద్దకే వైద్య సేవలు అందిస్తున్నారు.

31 ఏళ్లుగా వైద్య సేవలు



గత 31 ఏళ్లగా ప్రభుత్వ ఆస్పత్రిల్లో పనిచేస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉంది. ఒక డాక్టర్‌గా ఈ వృత్తిలో సంతృప్తి లభిస్తుంది. నేను మధ్యతరగతి కుటుంబంలో పుట్టాను. డాక్టర్ కావాలనేది మా అమ్మ కోరిక. కష్టపడి చదివి డాక్టరయ్యాను. ప్రైవేట్ ఆస్పత్రులు కాదని పేదలు వచ్చే ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేయాలని నిర్ణయించుకున్నాను. ప్రభుత్వం ప్రోత్సాహంతో పేద ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నాను.

– డాక్టర్ ఎం.వీరాస్వామి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు



డాక్టర్ వృత్తిలోకి వచ్చి 11 ఏళ్లయ్యింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉంది. కరోనా సమయంలో భీమవరం కోవిడ్ కేర్ సెంటర్‌లో బాధితులకు వైద్య సేవలు అందించి అనేక మంది ప్రాణాలను రక్షించడం చాలా సృంతప్తి నిచ్చింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పనిచేస్తూ పేషెంట్ల దగ్గరకు వెళ్తూ వైద్య సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ జి.సుగుణరాజు, తుందుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వారి కళ్లలో ఆనందం మరిచిపోలేం



డాక్టర్‌గా గత 15 ఏళ్లుగా పనిచేస్తున్నాను. డెలివరీ చేసి బిడ్డను తల్లిదండ్రులకు అప్పగించే సమయంలో వారి కళ్లల్లో ఆనందం చూసి మరిచిపోలేం. 8 ఏళ్ల కష్టపడి చదివి డాక్టర్ అయ్యాను. పేద, మధ్యతరగతికి ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు అందించడం చాలా సంతోషంగా ఉంది.

– డాక్టర్ కె. సింధీ ఆనంద్, గైనకాలజీస్టు, భీమవరం ప్రభుత్వ ఆస్పత్రి

ప్రభుత్వం వల్లే డాక్టరయ్యాను



నేను ఎంబీబీఎస్ ప్రభుత్వ కాలేజీలో చదువుకున్నాను. పీజీ కూడా ప్రభుత్వం కళాశాలలో చేశాను. ప్రభుత్వం వల్లే నేను డాక్టర్ అయ్యాను. అందుకే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలని నిర్ణయించుకుని వైద్య సేవలు అందిస్తున్నాను. డాక్టర్‌గా పేదలకు సేవలందించడంలో చాలా తృప్తి ఉంది.

– డాక్టర్ బి.శ్రీనివాస్, ఆర్థోపెడిక్ వైద్యుడు భీమవరం ప్రభుత్వ ఆస్పత్రి

చిన్న పిల్లలకు వైద్యం గొప్ప వరం



డాక్టర్‌గా చిన పిల్లలకు వైద్యం అందించడం గొప్ప వరంగా భావిస్తున్నాను. దేవుడితో సమానంగా భావించే పిల్లలకు వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలందించడంలో సంతృప్తి ఉంది.

– డాక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, చినపిల్లల వైద్యుడు, భీమవరం ప్రభుత్వ ఆస్పత్రి

4న అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవాలు

భీమవరం(ప్రకాశం చౌక్): విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంత్యుత్సవాలను రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ అధ్వర్యంలో జులై 4న నిర్వహిస్తున్నట్లు క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు(వాసు) తెలిపారు. శుక్రవారం భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో పాతపాటి వాసు మాట్లాడుతూ భీమవరంలో గత ఏడాది అల్లూరి 125వ జయంత్యుత్సవాలో భాగంగా 30 అడుగుల విగ్రహాన్ని ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. ఈ ఏడాది అదే అల్లూరి విగ్రహం వద్దే 126 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. వర్చువల్ విధానంలో రాష్ట్రపతి ముర్ము భీమవరం అల్లూరి విగ్రహం వద్ద అల్లూరి సీతారామరాజు స్మృతివనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్దరాజు వేణుగోపాలరాజు, గాదిరాజు సుబ్బరాజు, నారాయణ రాజు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల సమైక్య జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, సుబ్రహ్మణ్యంరాజు, సీహెచ్ రఘూన్సీ, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.



భీమవరం అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జయంత్యుత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పాతపాటి వాసు, క్షత్రియ నాయకులు

మాజీ మంత్రి రంగనాథరాజు ఔదార్యం



పెనుమంత్ర హైస్కూల్ సెంటర్‌లో ప్రమాద స్థలం వద్ద ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

పెనుమంత్ర: పెనుమంత్ర హైస్కూల్ సెంటర్‌లో చర్చి ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరు వ్యక్తులకు ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రథమ చికిత్స చేయించి సకాలంలో 108 వాహనంలో ఒక బాధితుడిని తణుకు ఆసుపత్రికి పంపే ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఆచంటలో తన కార్యాలయం నుంచి తాడేపల్లిగూడెం వెళ్తుండగా.. పెనుమంత్ర హైస్కూల్ సెంటర్‌లో ప్రమాదం ఆయన కంటపడింది. వెంటనే కారు ఆపి సంఘటనా స్థలానికి వెళ్లారు. తన కారులోని ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను తెప్పించి ప్రథమ చికిత్స చేయించారు. వెంటనే 108 వాహనం రప్పించి తీవ్రంగా గాయపడిన బ్రాహ్మణచెరువు గ్రామానికి చెందిన మేడపాటి మల్లికార్జునరెడ్డి అనే యువకుడిని తణుకు ఆసుపత్రికి పంపించారు. మోటరుసైకిల్, సైకిల్ ఢీకొనడంతో ప్రమాదం జరగగా.. ఒకరికి స్వల్పగాయాలు కాగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

చిన్నారి వైద్యానికి సాయం



సాక్షి స్పందన

చిన్నారి తండ్రికి నగదు అందిస్తున్న యునైటెడ్ కాపు క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్ : సాక్షిలో జూన్ 6న ప్రచురితమైన 'పసిబిడ్డ వైద్యానికి ఆదుకోండి సారూ' శీర్షికన ప్రచురించిన కథనానికి దాతలు స్పందించారు. శుక్రవారం చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం అందించారు. పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీ 25వ వార్డుకు చెందిన జక్కంపూడి వెంకటేష్, దేవి దంపతుల మూడు నెలల కుమార్తె క్రానియో సినోస్టోసిస్ వ్యాధితో బాధపడుతుంది. ఆమె వైద్యానికి సుమారు రూ. 4 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. సమస్య తెలుసుకున్న పట్టణ యునైటెడ్ కాపు క్లబ్ సభ్యులు రూ. 31 వేల ఆర్థిక సాయం అందజేశారు. క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, అధ్యక్షుడు పెనుమాక రామ్మోహనరావు, సెక్రటరీ జక్కంపూడి మధన్, ట్రెజరర్ కానూరి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి ముందు కోడలి నిరసన

పాలకోడేరు : తనను ఇంట్లోకి రానియ్యడం లేదంటూ అత్తింటి ముందు కోడలి నిరసన కార్యక్రమం మండల కేంద్రమైన పాలకోడేరులో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కడిమి ప్రదీప్‌తో అదే గ్రామానికి చెందిన కోమలికి 2019లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. గతేడాది అక్టోబర్ 8న తండ్రి మందలించాడన్న కోపంతో ప్రదీప్ యనమదుర్రు డ్రెయిన్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలం అత్తమామలు కోమలి, పిల్లలను జాగ్రత్తగా చూసుకున్నారు. ఆస్తి తగాదాలతో ఆ తర్వాత కోమలిని దూరం పెట్టడంతో.. ఆస్తిలో తనకు, పిల్లలకు వాటా ఉందని అవి పంచాలని అత్త రోజా, మామ రాజేంద్రప్రసాద్‌ను కోరింది. ఆస్తిని పంచకపోగా ఇంటి నుంచి పంపించేశారని కోమలి ఆరోపిస్తుంది. దీంతో శుక్రవారం ఉదయం అత్తింటి ముందు నిరసన వ్యక్తం చేసింది. పోలీసులు జోక్యం చేసుకొని ఆమెను ఇంట్లోకి పంపించారు. అయితే అత్త, మామ, ఆడపడుచు నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆమె పేర్కొంది. దీనిపై పాలకోడేరు ఎస్సై శ్రీనివాసరావును వివరణ కోరగా కోమలి ప్రస్తుతానికి ఫిర్యాదు చేయలేదని, ఎలాంటి కేసు నమోదు నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు

రెండు ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం వేగవరం ఎర్రకాలువ సమీపంలో అక్రమంగా మట్టి తవ్వుతున్న ఒక జేసీబీ, 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాగర్‌బాబు తెలిపారు. ఎర్ర కాలువలో అక్రమంగా మట్టి తవ్వుతున్నారన్న సమాచారం అందుకున్న ఎస్సై తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి

జంగారెడ్డిగూడెం: పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వకుండా భూమికి భూమి, ఇల్లుకి ఇల్లు ఇవ్వాలని, ముందు పునరావాసం పూర్తిచేసి తర్వాత ప్రాజెక్టు డ్యాం పూర్తిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ నెల 20న ఏటపాక మండలం నెళ్ళిపాకలో మొదలైన పోలవరం పోరు కేక పాదయాత్ర 11వ రోజు శుక్రవారం జంగారెడ్డిగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ప్యాకేజీ భూమి పరిహారం ఇవ్వలేదని తెలిపారు. పునరావాసం పూర్తయ్యే వరకు ఐఎఎస్ హోదాలో స్పెషల్ అధికారిని నియమించాలన్నారు.

గడపగడపకు సంక్షేమం



ఆకివీడు : మండలంలోని చినకాపవరంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

విద్యార్థులకు కథల పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కథ చెపుతారా.. ఊ కొడతాం! అనే శీర్షికతో విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించనున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ బీఎస్‌ఆర్ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలపై విద్యార్థులు కథలు చెప్పాలి. 10 సంవత్సరాల లోపు విద్యార్థులను జూనియర్లుగా, 11 నుంచి 15 సంవత్సరాల లోపు విద్యార్థులను సీనియర్లుగా పరిగణిస్తామన్నారు. ఈ రెండు విభాగాల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1000, ద్వితీయ బహుమతిగా రూ.750, తృతీయ బహుమతిగా రూ.500 పారితోషికం అందచేస్తామన్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించి జూలై 9న స్థానిక రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో, పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి తాడేపల్లిగూడెం బస్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న గీతా మందిరంలో పోటీలు జరుగుతాయన్నారు. ఇతర వివరాలకు 9492941754 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

పెదకాపవరంలో పిచ్చికుక్క స్వైరవిహారం

ఆకివీడు: మండలంలోని పెదకాపవరంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలో కొల్లేరు వెళ్లే రహదారి ప్రాంతంలో ఐదుగురిని కరిచింది. వారికి పెదకాపవరం పీహెచ్‌సీలో చికిత్స అందజేశారు. వెంకటలక్ష్మీ అనే మహిళను మెరుగైన వైద్యం కోసం భీమవరం తరలించారు. కొల్లేరు తీర గ్రామాల నుంచి కుక్కల్ని తీసుకువచ్చి గ్రామంలో వదిలివేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో శ్రీ లక్ష్మీ టైల్స్ అండ్ శానిటరీ షాపులో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు జీజే విష్ణువర్ధన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బొండాడ శ్రీనుకు చెందిన టైల్స్ అండ్ శానిటరీ దుకాణంలోని రూ.2లక్షల నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తులో భాగంగా అచ్యుతాపురానికి చెందిన చావల రామాంజనేయులు నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. రామాంజనేయులు అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

బాలసదనం సందర్శించిన హైకోర్టు జడ్జి



నూజివీడులోని బాలసదనంను సందర్శించి రికార్డులు పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ వీ రాధాకృష్ణ కృపాసాగర్

నూజివీడు: పట్టణంలోని ధండం గార్డెన్ లో ఉన్న బాలసదనంను హైకోర్టు జడ్జి జస్టిస్ వీ రాధాకృష్ణ కృపాసాగర్ శుక్రవారం సందర్శించారు. దీనిలో భాగంగా బాలసదనం రికార్డులను పరిశీలించడంతో పాటు అనాథ పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు. గత ఐదేళ్లుగా ఒక్క అధికారి కూడా బాలసదనంను సందర్శించకపోవడంపై జడ్జి విస్మయం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లోని ఐక్యూ లెవెల్, అందుతున్న విద్య, ప్రభుత్వ పథకాల వినియోగం, సామాజిక అంశాల పట్ల బాలికల స్పందన వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో పాతుకుపోయిన రుగ్మతలు, మూఢనమ్మకాలు, అపోహలపై పిల్లలకు ఆయన అవగాహన కల్పించారు. బాలసదనం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఇన్‌చార్జి రాగమయికి సూచించారు. డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్, సీఐ ఎంవీ వీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ శాగం రాధాకృష్ణారెడ్డి బందోబస్తు నిర్వహించారు.

రసవత్తరంగా బాస్కెట్‌బాల్ పోటీలు



కృష్ణా, అనంతపురం జట్ల మధ్య హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్

నూజివీడు: నూజివీడు డీఏఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న జాదం రామచంద్రరావు 8వ అంతర్ జిల్లాల బాలబాలికల జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు శుక్రవారం రసవత్తరంగా సాగాయి. పలు జట్లలో క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చి తమ జట్లను విజయపథంలో నడిపించారు. పలు జట్ల మధ్య మ్యాచ్‌లు హోరాహోరీగా జరగగా, పలు మ్యాచ్‌లు ఏకపక్షంగా సాగాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో బాలుర విభాగంలో కడపపై తూర్పు గోదావరి జట్టు, శ్రీకాకుళంపై కర్నూలు, శ్రీకాకుళంపై అనంతపురం, కడపపై గుంటూరు, ప్రకాశంపై చిత్తూరు, విజయవాడపై విశాఖపట్నం జట్టు, కడపపై గుంటూరు, నెల్లూరుపై పశ్చిమగోదావరి జట్టు విజయం సాధించాయి. బాలికల విభాగంలో ప్రకాశంపై విశాఖపట్నం, నెల్లూరుపై అనంతపురం, ప్రకాశంపై తూర్పుగోదావరి, విజయనగరంపై చిత్తూరు, శ్రీకాకుళంపై కృష్ణా జట్టు విజయం సాధించాయి. బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిఫరీలు పోటీలను నిర్వహించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం, సీపీఐ పార్టీలు ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేశారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

అత్తిలి: అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని మండల పరిషత్ అధ్యక్షుడు మక్కా సూర్యనారాయణ అన్నారు. అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించవద్దని అధికారులకు హితవు పలికారు. అత్తిలి కాలువకు తగిన పరిమాణంలో నీటి సరఫరాల లేకపోవడంతో సాగు, తాగునీరు సమస్య ఏర్పడుతోందని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, వరిఘేడు ఎంపీటీసీ సభ్యుడు అనిశెట్టి త్రిమూర్తులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దంతుపల్లిలో పైప్ లైన్ కనెక్షన్‌లు వెంటనే ఇవ్వాలని సర్పంచ్ కోరారు. గుమ్మంపాడు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను తెలిపారు. అత్తిలిలో కండక్టర్స్ వైరు మార్చాలని వేలాడుతున్న వైర్లను సరిచేయాలని ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్ విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూసర్వేలో పొలాలతో పాటు గృహాలు సర్వే చేస్తారని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు దారం శిరీషా, సుంకర నాగేశ్వరరావు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.


అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మక్కా సూర్యనారాయణ

జగనన్న సురక్షపై ఇంటింటా ప్రచారం

తణుకు టౌన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంపీడీవో పీ.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొమరవరం, కోనాల, ముద్దాపురం, వేల్పూరు 1, 2, దువ్వ 1 గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు అవసరమైన సేవలను గుర్తించి నమోదు చేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు చంద్రు శ్యామల, విజయదుర్గ, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కోనాల, ముద్దాపురం, కొమరవరం, వేల్పూరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన సేవలకు అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.


అత్తిలిలో జగనన్న సురక్ష సర్వేను తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు

జగనన్న సురక్ష సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

అత్తిలి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఇంటింటా సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి సీహెచ్ మురళీకృష్ణ ఆదేశించారు. శుక్రవారం అత్తిలి గ్రామంలో జరుగుతున్న ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నా రు. డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 15, 16 వార్డులలో మలేరియా మాసోత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సబ్ యూనిట్ పరిధిలోని 161 సచివాలయాల్లో మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. దోమలు నివారణకు దోమ తెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం శానిటేషన్ కార్యదర్శి దుర్గ ప్రసాద్, ఆరోగ్య సహాయకులు కాంతారావు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు జయశీల, ఆశలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్యవైశ్య మహాసభ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్యులు మారం వెంకటేశ్వరరావు నియమితులైయారు. రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు నియామక పత్రాన్ని పట్టణంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మారం వెంకటేశ్వరరావును పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు గమిని సుబ్బారావు, వబిలిశెట్టి నటరాజు, పేరూరి కాశయ్య, పెనుగొండ శ్రీనివాసరావు, మండా ప్రకాశ్, పులవర్తి పవన్, సొలస రాజేంద్ర ప్రసాద్, మండవల్లి పాపారావు పాల్గొన్నారు.

నేడు కొమ్ముగూడెంలో ఉప ముఖ్యమంత్రి పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో శనివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు కొమ్ముగూడెం సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభం, 12 గంటలకు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరగనున్న అమ్మ ఒడి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సాయంత్రం 5.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

శ్రీ శ్రీ కళావేదిక కన్వీనర్ కొల్లి రమావతికి ఘన సన్మానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న తాడేపల్లిగూడెంకు చెందిన, శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతిని తెలుగు, కన్నడ కవితా గోష్ఠిలో ఘన సన్మానం చేశారు. ఈ సన్మానంలో ప్రపంచ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ప్రముఖ కవయిత్రి ప్రభాశాస్త్రి, కన్నడ ప్రముఖులు సీబీకే, పాంచజన్య, శ్రీనివాస్ వాసుదేవ్, అవినాష్, కళావేదిక సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ తులసీ చందూపై దాడిని ఖండించాలి

తణుకు టౌన్: జర్నలిస్ట్ తులసి చందూపై దాడిని వ్యతిరేకిస్తూ సామాజిక న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో పౌరసమాజం తీవ్రంగా ఖండించింది. శుక్రవారం సురాజ్య భవన్‌లో ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.























